క్లుప్తంగా

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

గాజువాక: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు మంగళవారం ముగ్గులు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలను మండల స్థాయి పోటీలకు పంపించనున్నట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.విజయ ప్రశాంతి తెలిపారు. ప్రజాస్వామ్యం ఫరిడవిల్లడానికి, దేశం అభివృద్ధి చెందడానికి ఓటరులో చైతన్యం చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

24న ఐటీఐలో జాబ్ మేళా

పెదగంట్యాడ: ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో ఈ నెల 24న జాబ్ మేళా నిర్వహించనున్నామని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ పాస్ అయిన, అప్రెంటిస్ పూర్తి చేసిన అభ్యర్థులకు తిరుపతిలోని అమర్ రాజా గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నామని వివరించారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.21వేల జీతంతో పాటు వసతి, భోజనం, బస్సు సౌకర్యం, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 24న ఐటీలో నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9177338977 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

స్వాతంత్య్ర సమరయోధులకు ఘన నివాళి



సమరయోధులకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పెదగంట్యాడ: స్వాతంత్య్రం కోసం తమ ప్రాణాలను సైతం తృణపాయంగా అర్పించిన సమరయోధులను స్మరించుకోవాలని చేపలపాలెం మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కూరపాటి వినోద్ కుమార్ అన్నారు. పాఠశాల ఆవరణలో స్వతంత్ర సమరయోధులు రాస్ బిహారీ బోస్, కల్లూరి చంద్రమౌళి వర్ధంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో హఫీజా, బుడగట్ల హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

సత్యసాయి ట్రస్టీ రత్నాకర్ పర్యటనకు ఏర్పాట్లు



సత్యసాయి కేంద్రంలో పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న లక్ష్మణరావు

ఉక్కునగరం: సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె. రత్నాకర్ పర్యటన ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. రత్నాకర్ ఈ వారంలో ఉక్కు నగరం సత్యసాయి సేవా కేంద్రాన్ని సందర్శించనున్నారు. ఈ నేపథ్యంలో సత్యసాయి సేవా సంస్థల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. లక్ష్మణరావు మంగళవారం ఉక్కునగరం విచ్చేశారు. పర్యటన సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై ఉక్కునగరం సమితి కన్వీనర్ జి. రామకృష్ణ, ఇతర పదాధికారులకు పలు సూచనలు చేశారు. పర్యటన విజయవంతంగా జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సత్యసాయి ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

చైతన్య మూర్తి

వృత్తి వైద్యం.. ప్రవృత్తి సామాజిక చైతన్యం..

ఉరుకులు, పరుగుల జీవితంలో **మూడు పదుల వయసు** రాకుండానే బీపీ, షుగర్ వంటి **రోగాల బారిన** పడుతున్న వారిని చూసి అతను **చలించిపోయారు.** చౌకగా వైద్యం చేయడంతో **పాటు ఆ రుగ్మతల నుంచి** తప్పించుకోవాలంటే శారీరక **శ్రమే సరైన ఆయుధమని** గుర్తించారు. దాన్నే నినాదంగా **మార్చుకున్నారు. తను** ముందు శారీరక శ్రమ మొదలు **పెట్టారు. అన్ని** సౌకర్యాలు ఉన్నా గాజువాకలో **ఎక్కడికి వెళ్లినా** సైకిల్‌నే వినియోగిస్తున్నారు. **ఆరోగ్యం** ఆవశ్యకతను తెలియజేసేలా **చుట్టూ బోర్డులతో** ప్రయాణిస్తున్నారు. శారీరక శ్రమ చేయాలని.. మొక్కలు పెంచాలని .. ప్రయాణంలో హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పిస్తున్నారు.. అతనే గాజువాకలో అందరికీ తెలిసిన ప్రజా వైద్యుడు డాక్టర్ ఎం.రమేష్ కుమార్. - గాజువాక





సైకిల్‌పై వెళ్తున్న డాక్టర్ రమేష్ కుమార్

- శ్రమకొద్దీ ఆరోగ్యం
- ప్రజా వైద్యుడి స్ఫూర్తిదాయక ప్రచారం
- ఆధునిక యుగంలోనూ సైకిల్‌పై ప్రయాణం
- ఆరోగ్య, సామాజిక అంశాలపై అవగాహన కల్పించడమే లక్ష్యం

ప్రస్తుతం వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ మధుమేహం (షుగర్) బారిన పడుతున్న విషయం తెలిసిందే. బాలల నుంచి వృద్ధుల వరకు ఎక్కువ మంది ఈ సమస్యతోనే బాధ పడుతున్నారు. వీటికి తోడు బీపీ కూడా. కొద్దిగా శ్రమించి చిన్నపాటి వ్యాయామం చేస్తే ఈ వ్యాధులు రాకుండా నివారించే అవకాశం ఉన్నప్పటికీ సరైన అవగాహన లేక చాలామంది రోగాల బారిన పడుతున్న విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన 72 ఏళ్ల డాక్టర్ రమేష్ కుమార్ ఈ విషయాలపై అవగాహన కల్పించాలని సంకల్పించారు. అవసరమైతేనే బైక్‌లు, కార్లు ఉపయోగించాలని సూచిస్తున్నారు. అవకాశం ఉన్నంత వరకు నడిచి వెళ్లడం, లేని పక్షంలో సైకిల్ ఉపయోగించడం వల్ల కలిగే ఉపయోగాలను వివరిస్తూ ప్రచారం చేస్తున్నారు. సైకిల్‌కు నాలుగు బోర్డులు తగిలించుకొని గాజువాక పరిసర ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. మొక్కలు పెంచాలని అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు.



ఆరోగ్య నియమాలపై అవగాహన కల్పిస్తూ..

పిండికొద్దీ రొట్టె..

'పిండికొద్దీ రొట్టె.. శ్రమకొద్దీ ఆరోగ్యం' పేరుతో ఒక బోర్డు, 'షుగరు, బీపీ జబ్బులు కాదు.. మన పిల్లల జీవితానికి శాపాలు' అంటూ మరో బోర్డుపై, నడక అవసరాన్ని తెలియజేస్తూ ఇంకో బోర్డును సైకిల్‌కు ఏర్పాటు చేశారు. ఇలా ఒకటి, రెండు కాకుండా దాదాపు 20 అంశాలపై బోర్డులు తయారు చేయించారు. ఎప్పటికప్పుడు ఆ బోర్డులను సైకిల్‌కి మార్చి తగిలిస్తుంటారు. రకరకాల వ్యాధులు, వాటి నుంచి బయట పడడం కోసం చేయాల్సిన వ్యాయామాలు, తీసుకోవాల్సిన ఆహార జాగ్రత్తలతో వాటిని రూపొందించారు. గాజువాక పరిసర ప్రాంతాల్లో ఆయన ఏ కార్యక్రమానికి వెళ్లినా, ఏ ఫంక్షన్‌కు హాజరైనా సైకిల్‌నే ఉపయోగిస్తున్నారు. అక్కడ ఆరోగ్యం కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. ఆయన ఏర్పాటు చేసిన బోర్డుల్లో సందేశం పలువురిని ఆలోచింపజేస్తోంది.



పోలియోపై అవగాహన కల్పిస్తూ..

హెల్మెట్ ధారణపైనా ప్రచారం

స్కూటర్లు, బైక్‌లపైనే కాకుండా సైకిల్‌పై వెళ్లేవారూ హెల్మెట్ ధరించాలంటూ డాక్టర్ రమేష్ కుమార్ ప్రచారం చేపట్టారు. ఆయన కూడా తన సైకిల్‌పై వెళ్లేటప్పుడు హెల్మెట్‌ను విధిగా ధరిస్తారు. ప్రస్తుతం ట్రాఫిక్ విపరీతంగా పెరిగిన నేపథ్యంలో హెల్మెట్ ధారణ తప్పనిసరి అని ఆయన పేర్కొన్నారు. మారుతున్న ఆహార నియమాలు, లైఫ్ స్టైల్ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం గంట పాటు నడవాలని, అప్పుడే కొన్ని ఆరోగ్య సమస్యల నుంచైనా విముక్తి లభిస్తుందని పేర్కొంటున్నారు.

వయో వృద్ధులకు ఆసరాగా ఉంటాం



సీనియర్ సిటిజన్స్‌కు గుర్తింపు కార్డులు అందిస్తున్న రాష్ట్ర కోఆర్డినేటర్ కృష్ణారావు

అగనంపూడి: **వయో వృద్ధులకు** ఆసరాగా, వెన్నుదన్నుగా **ఉండడమే ధ్యేయం**గా హెల్పేజ్ ఇండియా **పని చేస్తుందని ఆ సంస్థ** రాష్ట్ర కోఆర్డినేటర్ అల్లు **కృష్ణారావు అన్నారు.** అగనంపూడి సీడబ్ల్యూసీలో స్థానిక సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హెల్ప్ ఏజ్ ఇండియా సహకారంతో బహుళ ప్రయోజనాలతో కూడిన సీనియర్ సిటిజన్స్ కార్డులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ వర్గాలకు చెందిన వృద్ధులు, నిరాశ్రయులకు బాసటగా ఉంటున్నామన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు గుదే సుశీలా గజేంద్రరావు, బలిరెడ్డి సత్యనారాయణ, మరిశా రామచంద్రరావు, సీతల సత్యనారాయణ, బి.కాళిదాస్, ఎం.విశ్వనాథం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అధ్యక్షుడికి సత్కారం



పరశురాంరాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

గాజువాక: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన పరశురాంరాజును ఆ పార్టీ గాజువాక నాయకులు అభినందించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దీనంకొండ కృష్ణంరాజు ఆధ్వర్యంలో నాయకులు జిల్లా అధ్యక్షుడికి పుష్ప గుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వి.రోహిణి, కట్టా పద్మ, ఇ.యువశ్రీ, గూటూరు శంకరరావు, పి.నాగేశ్వరరావు, దీనంకొండ పావని, పొలిమేర శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొత్త సారథులకు అభినందనల వెల్లువ



అమర్‌నాథ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జాన్ వెస్లీ తదితరులు



గురుమూర్తిరెడ్డితో గాజువాక సమన్వయకర్త దేవన్‌రెడ్డి

గాజువాక: వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్తగా నియమితులైన తిప్పల దేవన్‌రెడ్డిని, చోడవరం సమన్వయకర్తగా నియమితులైన గుడివాడ అమర్‌నాథ్‌ను ఆ పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్ వెస్లీ, విశాఖ జిల్లా అధ్యక్షుడు అద్దేపల్లి రవిబాబు, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ షరీఫ్ తదితరులు కలిసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు నీలాపు సర్వేశ్వరరెడ్డి, దినేష్‌రెడ్డి, ఈతలపాక రవిశంకర్ పాల్గొన్నారు.

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా నియమితులైన తిప్పల దేవన్‌రెడ్డి పలువురు నాయకులను కలిసి ధన్యవాదాలు తెలిపారు.

మాజీ మంత్రి, జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తి రెడ్డిని కలిశారు. సమన్వయంతో పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేద్దామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

సంప్రదాయానికి ప్రతీకలు..తీర్థాలు



దానప్పతల్లికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి



అమ్మవారికి పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి

- మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి
- వైభవంగా దానప్పతల్లి, సీతారాముల పరస మహోత్సవాలు

అగనంపూడి: తీర్థాలు.. ఉత్సవాలు సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తాయని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి నిర్వాసితకాలనీ దుగ్గపువానిపాలెం గ్రామదేవత దానప్పతల్లి తీర్థ మహోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిపించారు. దుగ్గపువానిపాలెం, కాశీపాలెం యువత అమ్మవారిని విశేషంగా అలంకరించారు. మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి పాల్గొని విశేష పూజలు చేశారు. సాయంత్రం ఆలయం వద్ద కోలాటం, సాము గరిడీలు, తోడుపెద్దు, తప్పెటగుళ్లు, పౌరాణిక నాటకం ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు దుగ్గపు వెంకట అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, జిల్లా కార్యదర్శి ప్రగడ వేణుబాబు, కమిటీ నాయకులు దుగ్గపు నరసింహమూర్తి, దానప్పలు, పిన్నింటి సంతోష్, నొక్కుల శంకర్, అప్పిని సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

దొంకాడలో...

అగనంపూడి నిర్వాసితకాలనీ దొంకాడలో మంగళవారం సీతారాముల పరస ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భజన, కోలాటం, గరిడీలు, తోడుపెద్దు గరిడీలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు దాసరి త్రినాథరావు, సన్యాసిరావు, కరణం శ్రీను, అట్టా అప్పారావు, బల్ల సత్తిబాబు, దాసరి నాయుడు, వెంకటరమణ, కరణం పెంటారావు పాల్గొన్నారు.



తోడ పెద్దు వద్ద గరిడీ చేస్తున్న భక్తులు




పరసలో భక్తుల కోలాహలం



కోలాట బృందంతో దొంకాడ ఉత్సవ కమిటీ, అతిథులు

ఉక్కులో భద్రతా విభాగం కీలకం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో శూన్య ప్రమాదాలు లక్ష్యంగా భద్రతా విభాగం ఉద్యోగులు పని చేయాలని స్టీల్‌ప్లాంట్ భద్రతా విభాగాధిపతి ఎం.ఎస్.ఎన్. రాజు కోరారు. ఇటీవల యాజమాన్యం ఎం.ఎస్.ఎన్. రాజును భద్రతా విభాగాధిపతిగా నియమించింది. ఈ మేరకు మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా విభాగం ఉద్యోగులు శాలువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ అందరూ సురక్షితంగా ఉంటేనే ప్లాంట్ మంచి ఉత్పత్తి, ఉత్పాదకత సాధించగలదన్నారు. ప్రస్తుతం ప్లాంట్ అధిక ఉత్పత్తి దిశగా సాగుతుందన్నారు. ఈ తరుణంలో భద్రతా విభాగం కీలకపాత్ర పోషించాలని కోరారు. ప్రతీ ఉద్యోగి భద్రతా నియామాలు పాటించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. అవసరమైన విభాగాల్లో భద్రతా తనిఖీలు నిర్వహించాలన్నారు. జోనల్ సేఫ్టీ ఆఫీసర్ బయ్యే మల్లయ్య, చింతా మోహన్‌రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డీజీఎంలు వరప్రసాదరావు, మిత్ర, పీఎస్ రావు, సాయి ప్రసాద్, టిర్కీ, కె. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఉక్కు భద్రతా విభాగాధిపతి రాజును సత్కరిస్తున్న ఉద్యోగులు

ఆరోగ్య బీమా పథకంలో మార్పులు సరికాదు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన ఉద్యోగుల మెడికల్ ఇన్‌స్రూ పథకంలో మార్పులు చేసి అన్యాయం చేసే ప్రతిపాదనలు విరమించుకోవాలని ఉక్కు విశ్రాంత ఉద్యోగుల అగనంపూడి అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. అగనంపూడి సీడబ్ల్యూసీలో నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఇప్పటి వరకు ఉన్న జీఎంఎస్, పీఆర్ఎంఎస్ మెడికల్ స్కీమ్‌ల్లో రిటైర్డ్ ఉద్యోగులకు అన్యాయం చేసేలా మార్పులు చేసేందుకు ప్రతిపాదనలు చేయడం అన్యాయమన్నారు.

ఇప్పటి వరకు విశ్రాంత ఉద్యోగి, అతని భార్యకు కలిపి రూ.2600 చెల్లిస్తే ఆరు లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తున్నారని, అలాగే బైట మందులు కొనుగోలు చేస్తే రూ.16 వేల వరకు బిల్లులు చెల్లింపులు చేసేవారని, అదే నేడు ప్రతిపాదన ప్రకారం అయితే రూ.20 వేలు చెల్లించాల్సి వస్తుందని, భార్య భర్తలిద్దరికీ రూ.8వేలు మాత్రమే బయటకొనుగోలు చేసిన మందులకు చెల్లించేలా ప్రతిపాదనలు చేయడం దారుణమని వాపోయారు. అసోసియేషన్ ప్రతినిధులు గుదే సుశీలా గజేంద్రరావు, కొలిపాక అప్పారావు, బలిరెడ్డి సత్యనారాయణ, సాయిన సన్యాసిరావు, విందుల వరహాలు, వై.ఎర్రయ్య, మరిశా రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న విశ్రాంత ఉద్యోగులు

వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



మాట్లాడుతున్న హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు

అగనంపూడి: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల్లో పరవాడ, సబ్బవరం మండలాలకు చెందిన 8,9,10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇటువంటి పోటీల్లో పాల్గొవడం వల్ల విద్యార్థుల మేధస్సు మరింత మెరుగుపడుతుందన్నారు. వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానంలో లంకెలపాలెం హైస్కూల్‌కు చెందిన కె.ప్రవీణ్‌కుమార్, ద్వితీయ బహుమతి ప్రభుత్వ హైస్కూల్‌కు చెందిన లావణ్య, తృతీయ బహుమతి పీఎంశ్రీ సబ్బవరం పాఠశాలకు చెందిన లాస్య దక్కించుకున్నారు. వక్తృత్వ పోటీల్లో ఎంజేపీ తానాం పాఠశాల విద్యార్థి బి.వెంకటలక్ష్మి, ద్వితీయ బహుమతిని లేమర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి జి.హరినాథ్, తృతీయ బహుమతి ఎంజేపీ తానాంకు చెందిన జె.హిమశ్రీ దక్కించుకునట్టు హెచ్‌ఎం నాగేశ్వరరావు తెలిపారు.



స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగులపై భారం!

8 రెట్లు పెరగనున్న హెల్త్‌స్కీం ప్రీమియం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగులపై వైద్య ఖర్చుల భారం పెంచడానికి యాజమాన్యం సన్నద్ధమవుతోంది. దీని కోసం కొత్త స్కీం సిద్ధం చేశారని.. అనుమతి లభించిన వెంటనే అమలు చేయడానికి సిద్ధమయ్యారనే సమాచారం విశ్రాంత ఉద్యోగుల్లో ఆందోళన రేకెత్తిస్తోంది.

ఇదీ పరిస్థితి : స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ కార్యక్రమంలో భాగంగా పోస్ట్ రిటైర్‌మెంట్ మెడికల్ స్కీమ్ ప్రవేశపెట్టారు. ఈ స్కీమ్ ద్వారా ఉద్యోగితో పాటు భార్యకు రూ. 1300 చొప్పున ఏడాదికి రూ. 2600 చెల్లిస్తున్నారు. తద్వారా భార్యభర్తలు రూ. 3 లక్షల చొప్పున హెల్త్ ఇన్సూరెన్స్ పొందుతారు. అదే విధంగా అవుట్ పేషంట్‌గా చెరో రూ. 8 వేల వరకు వైద్య ఖర్చులు పొందవచ్చు. ఇందు కోసం యాజమాన్యం ఏటా రూ. 30 కోట్లు వ్యయం చేస్తోంది. అయితే యాజమాన్యం ఆర్ఐఎన్ఎల్ గ్రూప్ మెడికల్ స్కీమ్ పేరిట మార్చిన నూతన స్కీంలో రిటైర్డ్ ఉద్యోగి ప్రతీ ఏడాది చెరో రూ.10 వేల చొప్పున చెల్లించాల్సి ఉంది. అదే విధంగా అవుట్ పేషంట్ చార్జీల పరిమితిని రూ. 4 వేలకు తగ్గించారు. నూతన స్కీం అమల్లోకి వస్తే సుమారు 10 వేల మంది రిటైర్డ్ ఉద్యోగులు ప్రస్తుతం చెల్లిస్తున్న దాని కన్నా 8 రెట్లు ఎక్కువ చెల్లించాల్సి వస్తుందని సమాచారం. స్టీల్ ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగులకు సరాసరి రూ. 2 వేలు మాత్రమే పెన్షన్ వస్తుంది. నూతన మెడికల్ స్కీమ్ వల్ల సంవత్సరం పెన్షన్ సొమ్మును మెడికల్ ఇన్సూరెన్స్ కోసం వెచ్చిస్తే ఎలా బతకాలని రిటైర్డ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాతపాలసీ కొనసాగించాలని కోరుతున్నారు.